జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 3 | జులై | 2026 ◆ పేజీలు : 5

## ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



**ఇల్లందు, జులై 2 (ప్రజాజ్యోతి)** ఏజెన్సీ ప్రాంతంలోని శాసనసభ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ప్రాంత ఎమ్మెల్యేల బృందం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోడు

మిగతా 2 లో...

# ఐటీడీఏ పనుల్లో... 'నాణ్యత'కు తిలోదకాలు...?

- ప్రారంభానికి ముందే గుంతలు పడుతున్న వంతెనలు.. బీటలు వారుతున్న గోడలు
- మూడు నాళ్ల ముచ్చటగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్ళు
- రిటైనింగ్ వాల్ పనులపైనా అదే నిర్లక్ష్యమనే విమర్శలు
- అంతా తానై శాసిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి



5 లో..

గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు మండలంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న వంతెనలు, గృహాలు, రిటైనింగ్ వాల్‌లు ప్రారంభ దశలోనే దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం నిర్మాణ సామగ్రి వినియోగం, నాణ్యత నియంత్రణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని విమర్శిస్తున్నారు.

● ములకలపల్లి, ప్రజాజ్యోతి

## ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ

- పాఠశాల నిర్వహణ, వసతులపై ప్రశంసలు వ్యక్తం చేసిన బృందం



**అన్నపురెడ్డిపల్లి, జూలై 2 (ప్రజాజ్యోతి):** అశ్వరావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని ఎర్రగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం గురువారం సందర్శించి తనిఖీ చేసింది. రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం నాయకుడు బి. సంపత్ కుమార్, పాయం సత్యలీల పాఠశాలలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, తల్లిదండ్రులు, గ్రామస్తులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. పాఠశాలలో భౌతిక వసతులు, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, క్రీడా కార్యక్రమాలు, గ్రంథాలయం, ప్రయోగశాలల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే సమగ్ర శిక్ష నిధుల వినియోగంపై ప్రధానోపాధ్యాయుడు ఉండేటి

మిగతా 2 లో...

## పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు

- పచ్చని చర్లే లక్ష్యం-డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మురళి
- ప్రతి ఇంటా మొక్కలు నాటాలి- డీపీఓ అనూష



**చర్ల, జూలై 02(ప్రజాజ్యోతి):** చర్ల మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అనూష, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మురళి ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీపీఓ అనూష మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో మొక్కలు నాటి వాటిని

మిగతా 2 లో...

## పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు




(మొదటి పేజీ తరువాయి...)

సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావి తరాలకు సుస్థిరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ప్రభు త్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ప్రజలు కూడా భాగస్వాములై ప్రతి ఇంటా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మురళి మాట్లాడుతూ, "పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఎంత ఎక్కువ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే అంతగా పర్యావరణం పరిరక్షించబడుతుందని తద్వారా భావితరాలకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణమైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. చర్ల మండలవ్యాప్తంగా ప్రారంభమైన వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, చర్ల పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, లింగాపురం సర్పంచ్ గుగులోతు మంగ, ఏపీఓ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి కృష్ణ, పంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి...)

భూములకు పట్టాలు మంజూరు చేయడం, ఇందిర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయడం, ఐటీడీఏలను మరింత బలోపేతం చేయడం, గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అట్లూరి లక్ష్మణ్, మహమ్మద్ అజారుద్దీన్, ఇల్లందు, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, ఖానాపూర్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, వెడ్మ బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ



(మొదటి పేజీ తరువాయి...)

ఆనందకుమార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలో సేకరించిన సమాచారంతో సమగ్ర నివేదికను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. తనిఖీ అనంతరం పాఠశాలలో నెలకొన్న పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ, భౌతిక వసతులు, బోధనా విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సామాజిక తనిఖీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పాఠశాల నిర్వహణ తీరు అభినందనీయంగా ఉందని పేర్కొంటూ, ఇదే స్థాయిలో విద్యా ప్రమాణాలు కొనసాగించాలని సూచించింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఉండేటి ఆనందకుమార్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి కే. మోహన్‌రావు, ఇన్‌చార్జి శంకర మహదేవన్, ఉపాధ్యాయులు సునందరెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి , బాబు రావు, వెంకటేశ్వర్లు, బాలు, వసంత, సుశీల, పద్మ, మోతీలాల్, జయరాం, ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, ఖాసిం, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ శిరీష, మండల డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటరమణ, తొలి అడుగు ఫౌండేషన్ సభ్యుడు లాలయ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శబరి బాలికా విద్యార్థి నిలయం ప్రారంభం

- **గిరిజన వికాసమే వనవాసీ కల్యాణ్ పరిషత్ లక్ష్యం: కొరివింజ రామచంద్రయ్య**






**చర్ల, జూలై 02:(ప్రజా జ్యోతి ):** గిరిజన సమాజ అభివృద్ధి, విద్యా ప్రగతే వనవాసీ కల్యాణ్ పరిషత్ ప్రధాన ధ్యేయమని ఆ సంస్థ అఖిల భారత ప్రశిక్షణ సభ్యులు కొరివింజ రామచంద్రయ్య అన్నారు. చర్లలో వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శబరి బాలికా విద్యార్థి నిలయంను గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామచంద్రయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వనవాసీ కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల కోసం 254 విద్యార్థి నిలయాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాటిలో 206 బాలురకు, 48 బాలికలకు సంబంధించినవని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి బాలికా విద్యార్థి నిలయాన్ని చర్లలో ప్రారంభించడం ఆనందదాయకమని అన్నారు సంకల్పం, సేవాభావం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని, చర్లలో బాలికా నిలయం ఏర్పాటు అందుకు నిదర్శనమని అన్నారు. ఇప్పటికే కొమరం భీం విద్యార్థి నిలయం విజయవంతంగా కొనసాగుతోందని అదే స్ఫూర్తితో శబరి పేరుతో బాలికల కోసం ప్రత్యేక నిలయాన్ని ఏర్పాటు చేయడం విశేషమన్నారు.దాతలు జవ్వాది కోదండరాంబాబు–సుమతి రామ్ దంపతులు విరాళంగా అందించిన స్థలంలో సుమారు రూ. కోటి వ్యయంతో బాలికల కోసం శాశ్వత భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. అప్పటి వరకు తాత్కాలికంగా తమ నివాసంలోనే నిలయం నిర్వహిస్తామని చెప్పారు. సమాజ హిత కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరిన రామచంద్రయ్య గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థి నిలయాలు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, వైద్య శిబిరాల ద్వారా గిరిజన సంక్షేమానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే యువతలో చైతన్యం పెంపొందించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత విద్యా ప్రముఖ్ మైసర్ల శంకర్, ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కోరెం సూర్యనారాయణ, కోరెం రామారావు, తాటి పాపారావు, మల్లాది సుబ్రహ్మణ్యం, గొంది శోభన్‌బాబు, జవ్వాది మురళీకృష్ణ, గోగికార్ రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్‌బాబు, శివరాజు కిషోర్, కీర్తి సురేష్, ఇరసవడ్ల రాము, మీసాల శ్రీనివాస్, శ్రీకర్, గాదె శంకర్‌బాబు, నిలయ ప్రముఖులు సాంబయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జేడీ మధన్, డీఈఓ వసంతి జానంపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల సందర్శన





**పినపాక,జులై 02(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలోని జానంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాలకులు (ఆర్‌జేడీ) మధన్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వసంతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకుని పలు ప్రశ్నలు అడిగారు.అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరింత కృషి చేయాలని, ప్రతి విద్యార్థి అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఎంఈఓ కొమరం నాగయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ లక్ష్మి ,ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి 108 అంబులెన్స్

- సత్యనారాయణపురం పీహెచ్‌సీకి మళ్లీ 108 అంబులెన్స్ కేటాయింపు



**చర్ల , జూలై 02 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోనిసత్యనారాయణ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) 108 అంబులెన్స్ సేవలను జిల్లా యంత్రాంగం తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల ఈ అంబులెన్స్‌ను చర్ల పీహెచ్‌సీకి తరలించడంతో పరిసర గ్రామాల ప్రజలు అత్యవసర వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అంబులెన్స్ లేకపోవడంతో గర్భిణులు, పాముకాటు బాధితులు, గుండెపోటు, రోడ్డు ప్రమాదాల బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించడం కష్టసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, దానవాయిపేట వార్డు సభ్యురాలు కణితి రజిని, రుంజ రాజా తదితరులు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. సమస్యను మీడియా ద్వారా కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సత్యనారాయణపురం పీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌ను (నంబర్: టి జి 08 టి 4821) పునరుద్ధరించారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత సులభంగా అందనున్నాయి.అంబులెన్స్ సేవలు తిరిగి ప్రారంభం కావడంపై సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు, మీడియా ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్, సత్యనారాయణపురం సర్పంచ్ చిక్కాల గౌతమి, కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్, వార్డు సభ్యురాలు కణితి రజిని, కణితి సోనీ, చరపా విజయ్‌కుమార్, హెచ్ఈఓ బాబురావు, ఎల్‌టీఈ రామకృష్ణ, హెచ్‌వీ తిరుపతమ్మ, ఎన్‌వో అనసూర్య, ఎన్‌వో పద్మ, సిబ్బంది సత్యనారాయణ, రుంజ రాజా, కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి



**బూర్గంపహాడ్, జూలై 2 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా సీనియర్ నాయకులు పూల పెల్లి సుధాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికార ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండే తత్వాన్ని గుర్తించి అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన నియామకం పై పూల పెల్లి సుధాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వానికి, రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గంపహాడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని చెప్పారు. ప్రభుత్వ ప్రచారంచక పాలనను, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు కట్టుబడి ఉంటారని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని భరోసాని ఇచ్చారు. పూలపెల్లి సుధాకర్ రెడ్డి నియమం పట్ల బూర్గంపాడు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉర్దూ మీడియం ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2,(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించనున్న ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఉర్దూ మీడియాన్ని కూడా ప్రవేశపెట్టాలని కోరుతూ మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ను కలిసి వినతి పత్రం అందజేశారు ,.ఈ సందర్భంగా యాకుబ్ పాషా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 118 ప్రీ–ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా , మండల కేంద్రాల్లో ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఉర్దూ మీడి యం ప్రీ–ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు,.తెలంగాణలో ఉర్దూ రెండవ అధికార భాషగా ఉన్నప్పటికీ, కాలక్రమే ణా దాని వినియోగం తగ్గిపోతోందని , చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే ఉర్దూ మాధ్యమంలో విద్యను అందించడం ద్వారా భాష పరిరక్షణతో పాటు అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని అన్నారు, ఉర్దూ మీడియం విద్య అందుబాటులోకి వస్తే మైనారిటీ విద్యార్థులు తమ మాతృభాషలో విద్యాభ్యాసం ప్రారంభించే అవకాశం లభిస్తుందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు, ఈ వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

## జీపీ నర్సరీలను,అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి

**టేకులపల్లి,జూలై 02,ప్రజాజ్యోతి:** గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు,మొక్కల సంరక్షణ, చిన్నారులకు అందుతున్న సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కొండపల్లి శ్రీదేవి గురువారం మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా తడకలపూడి,తావుర్య తండ, కొత్త తండ (పీ),రాంపురం, ప్రెగళ్లపాడు గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన జీపీ నర్సరీలను సందర్శించి అక్కడ మొక్కల పెంపకం,సంరక్షణ,నీటి సదుపాయం,పారిశుధ్యం, నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.నర్సరీల్లో మొక్కల మనుగడ శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని,ప్రతి మొక్కను సంరక్షిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు.నర్సరీల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తార్యతండ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె,చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ–స్కూల్ విద్య, హాజరు వివరాలు, కేంద్రంలో పరిశుభ్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు నాణ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్ వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ





సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్‌లో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు



**ఇల్లందు, జులై 2 (ప్రజా జ్యోతి )**మండలంలోని తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము ఎంపిక చేశారు. తిలక్ నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పండగ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా కుంజ మహేష్, ఎండి హర్షద్, ప్రధాన కార్యదర్శిగా వడ్లపెల్లి సురేష్, కార్యదర్శిగా సింగారపు హరీష్, కోశాధికారిగా వర్ష అనిల్ కుమార్, ప్రచార కార్యదర్శిగా గొట్టిపర్తి శ్రీకాంత్ గౌడ్ ఎన్నికయ్యారు. అదేవిదంగా విజయలక్ష్మి నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బర్ల సురేష్, ఉపాధ్యక్షులుగా జల్లి రాకేష్, మద్దెల నరేష్, ప్రధాన కార్యదర్శిగా బానోతు విజయ్, కార్యదర్శిగా కుమ్మరి అభిలాష్, కోశాధికారిగా తిప్పల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా భానోత్ మోహన్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేయడంలో నూతన కమిటీలు కీలకంగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, మార్కెటింగ్ డైరెక్టర్ వసంతరావు, సర్పంచ్ ధనసరి స్రవంతి రాజు, ఉపసర్పంచ్ గుడిల్లి రేణుక, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, పాయం స్వాతి, కత్తి పద్మ, తాటి బిక్షం, ముక్కి కృష్ణ, కాకటి భార్గవ్, ప్రసన్నతో పాటు మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణతో ఉద్యోగావకాశాలు.. ఈనెల 6న జాబ్ మేళా

- ఐటీసీ–ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు అవకాశం




**అన్నపురెడ్డిపల్లి, జూలై 2 (ప్రజా జ్యోతి):**ఐటీసీ, ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి మండలంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈనెల 6వ తేదీ సోమవారం అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎన్. వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు గురువారం అన్నపురెడ్డిపల్లి రైతు వేదికలో ఎంపీడీవో, సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఎలక్ట్రిషియన్, సోలార్ రంగాల్లో ఎంపికైన అభ్యర్థులకు అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో 30 రోజుల పాటు పూర్తిగా ఉచిత శిక్షణ అందించి, అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనం లభిస్తుందని, శిక్షణ సమయంలో యూనిఫాం కూడా ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు.8వ తరగతి, 9వ తరగతి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో ఈనెల 6న గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. కేవలం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు.సమావేశంలో సర్పంచులు లాకావత్ లక్ష్మి, కొండ్రు సృజన, అశోక్, సంఘవి తదితరులు పాల్గొన్నారు.

## సంఘటిత పోరాటంతోనే ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం

- కంచర్ల జమలయ్య



**కొత్తగూడెం టౌన్, జులై 02 ( ప్రజాజ్యోతి )**ఆటో కార్మికుల సమస్యలు సంఘటిత పోరాటంతోనే పరిష్కారమవుతాయని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, కొత్తగూడెం పట్టణ సీపీఐ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. గురువారం శేషగిరి భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభను యూనియన్ అధ్యక్షులు అబ్బులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, సామాజిక భద్రత కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. పెరుగుతున్న ఇంధన ధరలను నియంత్రించడంతో పాటు ప్రమాద బీమా, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో వివిధ ఆటో అడ్డాల ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరగా కంచర్ల జమలయ్య వారికి పార్టీ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఫయామ్, మర్రి కృష్ణ, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, విజ్జి, బాబు, జానీ దేశి, బోట్టు శ్రీను, మంద శ్రీను, జలీల్, గౌస్, చింటు తదితర నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


## మసూద్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- మంచి మిత్రుడిని కోల్పోయాం
- కాంగ్రెస్ జిల్లా నాయకుడు కనుకుంట్ల కుమార్



**కొత్తగూడెం టౌన్, జూలై 2 ( ప్రజాజ్యోతి )**కొత్తగూడెం రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని ప్రజాసేవలో చెరగని ముద్ర వేసిన సీనియర్ నాయకుడు మసూద్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కనుకుంట్ల కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ... మాజీ మంత్రి స్వర్గీయ కోనేరు నాగేశ్వరరావు ప్రియ శిష్యుడిగా రాజకీయాల్లో ఎదిగిన మసూద్ ప్రజా ప్రతినిధిగా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని అన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ అందరి అభిమానాన్ని చూరగొన్న నాయకుడని కొనియాడారు. మసూద్ మరణంతో పార్టీ ఒక సమర్థ నాయకుడిని, తాను వ్యక్తిగతంగా ఆప్త మిత్రుడిని కోల్పోయానని కనుకుంట్ల కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పాల్వంచ కేటీపీఎస్ లో ప్రమాదం ఆర్టిజన్ కార్మికునికి తీవ్ర గాయాలు



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2, (ప్రజా జ్యోతి )** పట్టణంలోని స్థానిక కేటీపీఎస్ ఏడోదశ కర్మకారంలో గురువారం జరిగిన ప్రమాదంలో ఒక ఆర్టిజన్ కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, ఏడదశ కర్మాగారంలోని కోల్ ప్లాంట్ క్రషర్ హౌస్ లో కోల్ క్లీనర్ గా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుడు నల్ల మాస రవికుమార్ కన్వేయర్ రూరల్ వద్ద బొగ్గు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రోలర్ రవి పై పడటంతో చేతికి తీవ్ర గాయాలయ్యాయి, గాయపడిన కార్మికుడిని అక్కడే ఉన్న తోటి కార్మికులు చికిత్స నిమిత్తం స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వై టి పి ఎస్ కర్మాగారంలో ఏ హెచ్ పి - సిహెచ్ పి నిర్వహణను టీజీ జెన్కో ఆధ్వర్యంలో కొనసాగించాలి

- టీ జాక్ నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 2 (ప్రజా జ్యోతి )**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఏ హెచ్ పి , సిహెచ్ పి నిర్వహణను టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక కేటీపీఎస్ ప్రధాన గేటు వద్ద టీ జాక్ ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు, ఈ సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ టీ జాక్ నాయకులు మాట్లాడుతూతెలంగాణ జెన్కో పరిధిలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యాష్‌హ్యాండ్లింగ్ ప్లాంట్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ప్రతిపాదనను పునఃపరిశీలించి, ఆ నిర్వహణను టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు, ఇజ్జత్ ఉత్పత్తి కేంద్రాల్లోని కీలక విభాగాలను ప్రభుత్వ రంగ ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారన్నారు , ఏ హెచ్ పి ,సి హెచ్ పి నిర్వహణలో ఉద్యోగులకు తగిన అనుభవం, సాంకేతిక నైపుణ్యం ఉందన్నారు, ప్రభుత్వ రంగంలోనే ఈ విభాగాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించే పూర్తి సామర్థ్యం టీజీ జెన్కోకు ఉందన్నారు, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని ఏ హెచ్ పి ,సి హెచ్ పి నిర్వహణను కూడా ప్రభుత్వ రంగంలోనే మరింత సమర్థంగా నిర్వహించగలమనీ కావున ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా టీజీ జెన్కో ఆధ్వర్యంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు, అదేవిధంగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని కీలక విభాగాలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడం ద్వారా సంస్థ సామర్థ్యం పెరగడంతో పాటు ఉద్యోగుల భద్రత, స్థానిక ప్రజల ప్రయోజనాలు, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కేటీపీఎస్ ఏడోదశ బ్రాంచ్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, కేటీపీఎస్ 56 దశల బ్రాంచ్ సెక్రటరీ బట్టు హరీష్, బి. రవి, రామకృష్ణ జాదవ్, సమీర్ అహ్మద్, కృష్ణయ్య , రాందాస్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు వంశీ, దూష సురేష్, రామ్ సింగ్ , తెలంగాణ డిప్లొమా ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్. స్పందన, నాగరాజు, బాల శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మల్సూర్‌తో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**టేకులపల్లి, జూలై 2,ప్రజాజ్యోతి:** టేకులపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ తిరుపతిని గురువారం బీఆర్ఎస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిష్పాక్షికంగా విధులు నిర్వహిస్తానని,శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఎస్ఐకి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, మాజీ ఎంపీటీసీలు జాలాది అప్పారావు, భూక్య బాలకృష్ణ, సర్పంచులు నాకా రామ, జాటోత్ నరేష్ కుమార్, బోడ రమేష్, ముచ్చ జయరాజ్, మాలోతు రాజేందర్, సంతోష్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నూతన కాంప్లెక్స్ హెచ్‌ఎం కు సన్మానం



**ఇల్లందు, జులై 2 (ప్రజా జ్యోతి )** మండలంలోని కొమరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు, కాంప్లెక్స్ నూతన హెచ్‌ఎం లింగా నాయక్ ను గురువారం కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలోని ఉపాధ్యాయులు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## బోడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డీఈవో, ఆర్‌జేడీ తనిఖీ





**టేకులపల్లి,జూలై 02,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని బోడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) వాసంతి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) మదన్ మోహన్ గురువారం సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు.డీఈవో వాసంతి తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు.బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేయడంతో పాటు, విద్యార్థులు చదువులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా మార్గనిర్దేశం చేశారు.ఆర్‌జేడీ మదన్ మోహన్ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చెందనున్న బోడు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో భౌతిక వసతులు, మౌలిక సదుపాయాలు,అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై ప్రధానోపాధ్యాయులు అజ్మీర జగన్‌తో పాటు గ్రామస్తులతో చర్చించారు.ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా బోడు జడ్పీహెచ్‌ఎస్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు శేకర్, వీరభద్రం, రవి, శ్రీనివాస్, సైదులు, బాలాజీ తదితరులు పాల్గొని పాఠశాల అభివృద్ధి, గ్రామ సహకారం, అందుబాటులో ఉన్న వనరులపై తమ అభిప్రాయాలను అధికారులకు వివరించారు.

- ప్రారంభానికి ముందే గుంతలు పడుతున్న వంతెనలు.. బీటలు వారుతున్న గోడలు
- మూడు నాళ్ల ముచ్చటగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్ళు
- రిటైనింగ్ వాల్ పనులపైనా అదే నిర్లక్ష్యమనే విమర్శలు
- అంతా తానై శాసిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి



# ఐటీడీఏ పనుల్లో... 'నాణ్యత'కు తిలోదకాలు...?

**గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐటీడీఏ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు మండలంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న వంతెనలు, గృహాలు, రిటైనింగ్ వాల్‌లు ప్రారంభ దశలోనే దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం నిర్మాణ సామగ్రి వినియోగం, నాణ్యత నియంత్రణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని విమర్శిస్తున్నారు.**

ములకలపల్లి, ప్రజాజ్యోతి

### ప్రారంభానికి ముందే గుంతలు,బీటలు వారి దెబ్బతింటున్న వంతెనలు

మండలంలోని ముత్యాలంపాడు, కుమ్మరిపాడు, తాళ్లపాయి ప్రాంతాల్లో సుమారు రూ.9 కోట్ల ఐటీడీఏ నిధులతో వంతెనల నిర్మాణం జరుగుతోంది. అయితే ముత్యాలంపాడు వంతెన ప్రారంభోత్సవానికి ముందే స్లాబ్ పై గుంతలు ఏర్పడటంతో పాటు పగుళ్లు కనిపించడం స్థానికులను కలవరపెడుతోంది. కుమ్మరిపాడు వంతెన సైడ్ వాల్ పై కూడా బీటలు ఏర్పడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు. తాళ్లపాయి వంతెన నిర్మాణం పూర్తై రెండేళ్లు గడిచినా ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదని, ప్రజల కోసం నిర్మించిన ఐరన్ వంతెన కూడా వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారిందని ఆరోపిస్తున్నారు.

### నాణ్యతా లోపాలతో డబుల్ బెడ్ రూం ఇళ్లు



గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ నిధులతో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలోనూ నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముత్యాలంపాడు, కమలాపురం గ్రామాల్లో నిర్మించిన ఇళ్ల స్లాబ్ లు ఊడిపోవడం, వర్షపు నీరు కారడం వంటి సమస్యలు నెలకొన్నాయని చెబుతున్నారు. మండలంలోని మరికొన్ని ఇళ్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాక ముందే శిథిలావస్థకు చేరుకున్నాయని, దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రిటైనింగ్ వాల్ పనుల పైనా విమర్శలు

కొత్తగంగారం డబుల్ బెడ్ రూం ఇళ్లకు వరద ముప్పు నివారించేందుకు రూ.31 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాసిరకం నిర్మాణ సామగ్రి, పనికిరాని ఇసుకను వినియోగిస్తున్నారని విమర్శిస్తున్నారు.

### పనికిరాని ఇసుకతో నిర్మాణాలా?

ఐటీడీఏ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యమైన ఇసుక వినియోగించాల్సి ఉండగా, స్థానికంగా లభించే మట్టి ఇసుకనే ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల నిర్మాణాలు ప్రారంభ దశలోనే దెబ్బతింటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముత్యాలంపాడు, కుమ్మరిపాడు వంతెనల పరిస్థితినే ఇందుకు నిదర్శనంగా చూపుతున్నారు.

### ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు

ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కాంట్రాక్టర్ల ఎంపిక, పనుల మంజూరు, బిల్లుల చెల్లింపులతో పాటు నిర్మాణ సామగ్రి ఎంపికలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారాల కారణంగానే నాసిరకం పనులు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ నిధులతో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముత్యాలంపాడు వంతెన, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు, రిటైనింగ్ వాల్ పనుల్లో నాణ్యతా లోపాలపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.

### ఈ విషయమ ఐటిడిఏ ఏఈ సుబ్బరాజు ను వివరణ కోరగా ....

ఈ ఆరోపణలపై ఐటీడీఏ ఏఈ సుబ్బరాజును వివరణ కోరగా, కొత్తగంగారం వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనుల్లో వినియోగిస్తున్న ఇసుక నాసిరకంగా ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఆ పరిస్థితికి గల కారణాలపై స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ముత్యాలంపాడు, కుమ్మరిపాడు వంతెనలలో ఏర్పడిన గుంతలు, పగుళ్లపై ప్రశ్నించగా, "భద్రాచలం బ్రిడ్జికే బీటలు వస్తాయి... గుంతలు పడుతుంటాయి" అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉంది.



